జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 17-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 485 పేజీలు: 4 వెల: రూ.7

# కొత్తూరు తహశీల్దార్‌కు.. ఏమైంది?



* ఇటీవల తరచూ వివాదాలు * ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారిన మండల అధికారి వ్యవహారం * అండగా ఉన్న సంఘాలు సైతం నేడు దూరం * పొజిషన్ సర్టిఫికెట్ కోసం మహిళతో వివాదం * ఓ నేతతో కూడా వాగ్వాదం * ఈ తహశీల్దార్ మాకొద్దంటూ ఏకంగా మండలి సభ్యులు తీర్మానం

**కొత్తూరు, అక్టోబరు 15 (వార్త):** కొత్తూరు తహశీల్దార్ బాలకృష్ణ ఇటీవల తరచూ వివాదాలకు కేంద్ర బింధువయ్యాడు. గతంలో వివాదరహితుడని పేరు ఉండేది. ఇటీవల ఏమైందో ఏమో గాని అందరితోనూ చిన్న విషయానికి కూడా వాగ్వాదం చేస్తూ ఉన్న మంచి పేరును పాడు చేసుకుంటున్నాడని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల పదోన్నతిపై కొత్తూరు తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తారన్న పేరు కూడా ఉంది. ఈ మధ్యన ఏమైందోగాని నోరుపారేసుకుని వివాదాలకు కారణమవుతున్నారు. ఏకంగా తహశీల్దార్‌పై మండల సర్వసభ్య సమావేశంలో ఇతగాడు మాకొద్దని సభ్యులంతా తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ఓ ఇంటి పొజిషన్ సర్టిఫికెట్ విషయమై అసభ్యకరంగా ప్రవర్తించాడని ఓ మహిళ రోడ్డెక్కి నానా రభస సృష్టించింది. ఈవిషయమై సామాజిక మాధ్యమాల్లో సైతం హల్‌చల్ అయింది. తహశీల్దార్‌కు పలు సంఘాలు మద్దతు ఇచ్చారు. ఈ ఘటన మరువకముందే కొత్తూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ముందే తహశీల్దార్.. వైస్ ఎంపీపీపై నోరుపారేసుకున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అన్న వరకూ మాటల యుద్ధం సాగింది. ఆ తర్వాత తహశీల్దార్ సమావేశం మధ్యనుంచే వెళ్లిపోయారు. తహశీల్దార్‌ను తీరును నిరసిస్తూ సభ్యులంతా ఆయన మాకొద్దంటూ ఏకంగా తీర్మానమే చేసి కలెక్టర్‌కు పంపించారు. తహశీల్దార్‌కు మద్దతుగా నిలిచిన కొన్ని సంఘాలు సైతం నేడు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. మండల అధికారి తీరుపై ఉన్నతాధికారులు సైతం ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.




## రోడ్డుపైన కాలువ నిర్మాణం



* నిబంధనలు పాటించని గృహ యజమాని * కొంతమంది మున్సిపాలిటీ అధికారుల సహకారంతోనే అంటూ విమర్శలు * నిద్దరోడుతున్న టౌన్ ప్లానింగ్

**పలాస, అక్టోబరు16 (వార్త):** పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీ శివాజీ నగర్ 20వ వార్డులో అక్రమంగా కాలువ నిర్మాణం జరుగుతోంది. దీనిపై కొంతమంది మున్సిపల్ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. గతంలో మునిసిపల్ కమిషనర్ చొరవ తీసుకొని తమ సిబ్బందిని పంపించి పనులు నిలిపివేయించారు. అయితే ఇటీవల మళ్లీ ఆ భవన యజమాని తిరిగి యధావిధిగా తన పనులు ప్రారంభించాడు. ఆ భవన యజమానికి కొందరు మున్సిపల్ అధికారుల అండదండలు ఉండడంతో తిరిగి పనులు ప్రారంభించాడన్న విమర్శలు ఉన్నాయి. ఇటువంటి అక్రమ నిర్మాణాలపై కన్నేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్దరోడుతుండడం వల్లే కొందరు ఇష్టారాజ్యంగా కట్టడాలు చేస్తున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇకనైనా కమిషనర్ స్పందించి తగు చర్యలు చేపట్టాలని 20వ వార్డు ప్రజలు కోరుతున్నారు.

# ఎచ్చెర్ల ఎంపీపీపై.. పీడీ యాక్ట్

* విశాఖ కారాగారానికి మొదలవలస చిరంజీవి
* శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జిల్లా నుంచి బహిష్కరణ
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం, అక్టోబరు16 (వార్త):** చట్టాన్ని తరచూ ఉల్లంఘిస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, సమాజానికి ప్రమాదకరంగా మారుతూ, భౌతికదాడులకు పాల్పడుతూ, సుమారు 14 కేసుల్లో నిందితుడిగా ఉండి అరెస్టయిన ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటకు చెందిన మొదలవలస చిరంజీవిపై పీడీ యాక్టు కింద విశాఖపట్నం కేంద్ర కారాగారానికి తరలించామని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మొదలవలస చిరంజీవి చెడు వ్యసనాలకు అలవాటు పడి, ప్రజలతో అహంకారంతో దురుసుగా ప్రవర్తిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, ఇతరులకు హాని కలిగించే విధంగా చిన్న చిన్న విషయాలకే గొడవలు పడుతూ, భౌతిక దాడులకు పాల్పడుతున్నాడన్నారు. అతనిపై గత రెండేళ్లలో పలు కేసులు నమోదయ్యాయన్నారు. చిరంజీవి ప్రవర్తన సమాజానికి హానికరంగా మారుతున్న కారణంగా నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా పి.డి.యాక్ట్ అమలు చేయాలని కోరుతూ ఎచ్చెర్ల పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. వాటిని సిఫార్సు చేస్తూ జిల్లా కలెక్టరు స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. మొదలవలస చిరంజీవిపై ఎచ్చెర్ల పోలీసు స్టేషనులో రౌడీషీటు ఉందన్నారు. ఎచ్చెర్ల పోలీసుల ప్రతిపాదనలను జిల్లా కలెక్టరు పరిశీలించి, నిందితుడి ప్రవర్తన సమాజానికి ప్రమాదకరంగా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తిగా మారుతున్నాడని భావించి, చిరంజీవిని నిర్భందించి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించామని జిల్లా ఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగించినా, చైన్ స్నాచింగ్స్, రోబరీ, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణకు పాల్పడినా, భూదురాక్రమణలకు పాల్పడినా, ల్యాండ్ గ్రాబర్లు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, సమాజానికి ప్రమాదకరంగా మారితే ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి నిందితులను గుర్తించి, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపట్టడానికి వెనుకాడబోమన్నారు. నిందితుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలించి, అటువంటి వ్యక్తులపై షీట్లు ప్రారంభించడం, పి.డి.యాక్టుకు ప్రయోగించడం, నేరాల నియంత్రణకు ముందస్తుగా నిర్భందిస్తామన్నారు. నిందితులు సత్ప్రవర్తనతో, చట్టాన్ని గౌరవిస్తూ జీవించాలని, నేర ప్రవృత్తిని విడనాడాలన్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులపైనా, వివిధ క్రిమినల్ కేసుల్లో అరెస్టుకాబడిన నిందితులపై నిరంతర నిఘా ఉంటుందని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. పీడీ యాక్టు కింద అరెస్టు అయిన వారిని జామీను లేదా త్వరితగతిన విడుదల సాధ్యం కాదని జిల్లా ఎస్పీ కేవి మహేశ్వర రెడ్డి తెలిపారు.

## 209 కేజీల గంజాయి స్వాధీనం

గంజాయిని తరలిస్తున్న ఇద్దరి నుంచి 209 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం మీడియాకు తెలిపారు. చిలకపాలెం నుంచి పొందూరు వైపు వస్తున్న వాహనాలను ఎచ్చెర్ల పోలీసులు బుధవారం తనిఖీలు చేస్తున్నారన్నారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా లంపటాపుట్ గ్రామానికి చెందిన సమర మాటం, డొంబురు గోపాల్‌లు ఓ కారులో 40 ప్యాకెట్ల గంజాయిని తరలిస్తూ ఎచ్చెర్ల పోలీసులకు పట్టుబడ్డారన్నారు. వీరు 209 కేజీల గంజాయిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో తరలిస్తున్నారన్నారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో క్రియాశీలంగా వ్యవరించిన ఈగల్ టీమ్, పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



## మందస కోవా.. మజాకా!

* విశాఖ నుంచి మందసకు బస్సులో వచ్చిన మహిళ * కూటమి పుణ్యామంటూ ఉచిత ప్రయాణం * విస్తుపోయిన స్థానికులు



**మందస, అక్టోబరు 16 (వార్త):** మందస కేవా మహా క్రేజ్ ఉంది. ఒకప్పుడు ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ కోవాకు నేటికీ గిరాకీ ఉంది. సుదూర ప్రాంతాల నుంచి కూడా మందస కోవా తినడానికి, తీసుకెళ్లడానికి వస్తుంటారు. ఇదీ షరామామూలే. కొత్తగా ఓ సంఘటన స్థానికులను విస్తుపోయేలా చేసింది. విశాఖపట్నం నుంచి వచ్చిన ఓ మహిళ రెండు కోవా సీసాలను కొనుగోలు చేసింది. విశాఖ నుంచి బస్సులో వచ్చిన ఆమె అదే బస్సులో తిరిగి వెళ్లిపోవడం విశేషం. ఇదంతా ఏమిటనుకుంటున్నారా..? కూటమి ప్రభుత్వ పుణ్యమే. విశాఖపట్నం నుంచి మందసకు కోవా తి(కొ)నడానికి వచ్చిన మహిళను చూసి, అక్కడ ఉన్నవారంతా ఆశ్చర్యపోయారు. విశాఖపట్నంలో ఉదయం ఓ ఆర్టీసీ బస్సు బయలుదేరుతుంది. 11 నుంచి 11.30గంటల మధ్య మందసకు వస్తుంది. సిబ్బంది కొంతసేపు విశ్రాంతి తీసుకున్నాక.. తిరిగి విశాఖపట్నం బస్సు వెళ్లిపోతుంది. ఈ సమాచారం ఆన్ లైన్ ద్వారా తెలుసుకున్న ఓ మహిళ విశాఖపట్నంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణించి, మందస చేరుకుంది. మందస బస్టాండ్‌లో రెండు కోవా సీసాలను కొనుగోలు చేసింది. కొన్ని స్వీట్లు, కోవాను తిన్నాక, తన ప్రయాణ వివరాలను అక్కడివారితో పంచుకుంది. తిరిగి అదే బస్సులో విశాఖపట్నం వెళ్లిపోయింది. దీంతో అక్కడి వారంతా ముక్కున వేలేసుకున్నారు. మందస కోవా కోసం 400 కిలోమీటర్లు ప్రయాణం చేసిన ఆమె ఓపిక పట్ల ఆశ్చర్యపోయారు.

## పేద కుటుంబానికి.. పెద్ద గాయం

* రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన తండ్రీ కొడుకు * ప్రాణాలు కాపాడు కునేందుకు శ్రీకాకుళం పెద్ద ఆసుపత్రికి * సహాయం కోసం దాతలను ప్రార్థిస్తున్న కుటుంబం

2లో

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సందర్శించిన నాగబాబు

**శ్రీకాకుళం, అక్టోబరు16 (వార్త):** శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌ని జనసేన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు గురువారం పరిశీలించారు. వర్షం పడితే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన నేప థ్యంలో ఆయన పరిశీలనకు వచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. శ్రీకాకుళంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నీటి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని కౌన్సిల్‌లో మంత్రుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ నాగబాబును ఆర్అండ్‌బీ అతిథి గృహానికి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. జిల్లాకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.



# రాజకీయ బాహుళ్యంలోకి మళ్లీ.. ఇప్పిలి

*** అంతర్గత విభేదాలతో కొంతకాలం దూరం**

*** కష్టకాలంలో పార్టీ కార్యక్రమాలలో నేను సైతం**

**సోంపేట/ కంచిలి, అక్టోబరు 16 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గం కంచిలి మండలంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రస్తుత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వరకు అన్ని వర్గాల ఆదరాభిమానాలు పొందిన నేత ఇప్పిలి కృష్ణారావు. దశాబ్దాల తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లకు గురైనప్పటికీ మొక్కవోని ధైర్యంతో రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న వ్యక్తి ఇప్పిలి. గతంలో కాంగ్రెస్ పార్టీ ఏలుబడిలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన కృష్ణారావు అనంతరం వైసీపీ ఏలుబడిలో తన రాజకీయ పలుకుబడి మసకబారిందని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. రాజకీయాల్లో ప్రతి నాయకుడికి ఉత్థాన పాతాలు ఉంటాయని చెప్పడానికి కంచిలి మండలంలో ఇప్పిలి కృష్ణారావు ఓ ఉదాహరణ. పార్టీ పట్ల అంకిత భావం, అభివృద్ధి సాధనలో పట్టుదల, కార్యకర్తలను కలుపుకుంటూ వెళ్లే నైజం... ఇవన్నీ ఉన్నప్పటికీ నాయకులు తేడా కనబరిస్తే పార్టీకి దూరంగా ఉండటం ఈయన వ్యక్తిత్వం. ఈ కోవలోనే 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితుల రీత్యా నియోజకవర్గ నాయకత్వానికి దూరంగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను కూడా అంతగా పట్టించుకోని ఇప్పిలి ఇటీవల కాలంలో పార్టీకి అండగా నిలుస్తూ రాజకీయ ప్రజా బహుళ్యంలో తనదైన పాత్ర పోషిస్తున్నారు.

ఎంతోకాలంగా కంచిలి మండలంలో కాంగ్రెస్ పార్టీకి అంకిత బద్ధుడిగా పనిచేసిన ఇప్పిలి కృష్ణారావు గతంలో అదే పార్టీ నుంచి ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన నరేష్ కుమార్ అగర్వాల్‌నే విభేదించిన సంగతి అందరికీ తెలిసిందే. అనంతరం కాంగ్రెస్ నుంచి వైసీపీలోకి వచ్చిన కృష్ణారావు 2021 లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో తీవ్ర అసంతృప్తికి గురై నియోజకవర్గ నేతలకు దూరమయ్యారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన పైల దేవదాసు రెడ్డికి మండల పరిషత్ అధ్యక్షునిగా అవకాశం ఇవ్వడం, ఇప్పిలి సతీమణికి జడ్పిటిసి అవకాశం ఇవ్వడం పట్ల కృష్ణారావు వైసీపీ ఇన్చార్జ్ పిరియా సాయిరాజ్‌తో తీవ్రంగా విభేదించారు. అప్పటివరకు కంచిలి మండలంలో నంబర్ వన్ స్థానంలో ఉన్న ఇప్పిలిని అన్ని విషయాల్లోనూ ప్రాధాన్యం తగ్గించడం పట్ల పార్టీ కార్యక్రమాలకు కూడా కొన్ని సంవత్సరాల పాటు దూరంగానే ఉన్న సంగతి విధితమే.






గతంలో మండల ప్రజానీకం సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి పరిష్కారానికి కృషి చేసిన ఇప్పిలి గత స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం పార్టీ తీరు పట్ల తీవ్ర అసంతృప్తితో కొనసాగిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో పార్టీలో కొత్తగా వచ్చిన దేవదాస్ రెడ్డి ఎంపీపీగా ఎన్నికై కంచిలి మండలంలో పార్టీకి ఎన లేని సేవలు అందిస్తూ ఇప్పిలి లేని లోటును మండలంలో కొంతమేరకు భర్తీ చేయగలిగారు.

ఈ పరిస్థితుల్లో తీవ్ర అసంతృప్తికి గురైన కృష్ణారావు పార్టీ మారిపోతారన్న అభిప్రాయాలు కూడా అనేకమందిలో వ్యక్తం అయ్యాయి. ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా ఇప్పిలి కృష్ణారావు మళ్లీ తన రాజకీయ చైతన్యాన్ని పున ప్రారంభించారు. కొన్ని నెలలుగా వైసిపి నిర్వహిస్తున్న ప్రభుత్వ వ్యతిరేక నిరసన కార్యక్రమాలలో తన సతీమణి కంచిలి జడ్పిటిసి ఇప్పిలి లోలాక్షితో కలిసి ఉత్సాహంగా పాల్గొంటూ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. అయితే మండల స్థాయిలో ఎంపీపీ దేవదాసు కు జడ్పిటిసి ప్రతినిధి కృష్ణారావుకు మధ్య ఇప్పటికీ సయోధ్య లేకపోవడం కార్యకర్తలకు రుచించడం లేదు. ఇటువంటి పరిస్థితిని చక్కదిద్దాల్సిన నియోజకవర్గ పెద్దలు కనీసం కూడా ప్రయత్నాలు చేయకపోవడం పట్ల కార్యకర్తల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పార్టీ పెద్దలు ఎంతసేపు తమ సొంత పదవులు కాపాడుకోవడం, వచ్చే ఎన్నికల్లో సీటు కోసం ఆరాటం తప్ప మండలాల్లో నెలకొన్న విభేదాలను సరి చేయడంలో ఘోరంగా విఫలమవుతున్నారని కార్యకర్తలు బాహాటంగా పేర్కొంటున్నారు. కంచిలి మండలంలో ఎంపీపీ జడ్పిటిసి వర్గాలను ఏకం చేసినట్లయితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం ఖాయమని వైసిపి శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. పార్టీకి మళ్ళీ దగ్గరైన కృష్ణారావును సద్వినియోగం చేసుకొని నియోజకవర్గ నేతలు పార్టీ బలోపేతానికి కృషి చేస్తారో లేక వారి ఖర్మ అంటూ విస్మరిస్తారో వారికే తెలియాల్సి ఉంది.

ఇదిలా ఉండగా మండలంలో వైసీపీలో అందరికన్నా సీనియర్ నేతగా గుర్తింపు పొందిన ఇప్పిలి వచ్చే స్థానిక ఎన్నికల్లో మండల పరిషత్ ను ఆశిస్తూ పార్టీకి చేరువైనట్లు వినికిడి. రాబోవు రోజుల్లో ఎవరి కలలు ఎలా నెరవేరుతాయో వేచి చూడాల్సిందే.

# పేద కుటుంబానికి పెద్ద గాయం

*** రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన తండ్రీ కొడుకు * ప్రాణాలు కాపాడుకునేందుకు శ్రీకాకుళం పెద్ద ఆసుపత్రికి * సహాయం కోసం దాతలను ప్రార్థిస్తున్న కుటుంబం**





**సోంపేట, అక్టోబరు16 (వార్త):** రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబంపై.. రోడ్డు ప్రమాదం ఓ పెద్ద పిడుగులా వచ్చి పడింది. రైల్వే స్టేషన్‌లో దిగిన కొడుకును, బైక్‌పై తండ్రి ఇంటికి తీసుకువచ్చే క్రమంలో జరిగిన ఊహించని ప్రమాదం ఆ కుటుంబాన్ని కలచివేసింది. రోడ్డు ప్రమాదంలో తండ్రి పరిస్థితి విషమంగా ఉంది. కుమారుడికి కూడా తీవ్ర గాయాలయ్యారు. వీరిద్దరూ శ్రీకాకుళం లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తండ్రి కోమాలో ఉండడంతో గురువారం ఉదయం వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించారు. వివరాల్లోకి వెళితే కవిటి మండలం లండారి పుట్టుక పంచాయతీ పొందూరు పుట్టుక గ్రామానికి చెందిన దూగాన రమణమూర్తి 40 తాపీ మేస్త్రిగా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ వస్తున్నాడు. భార్య ఇద్దరు కుమారులతో జీవనం సాగిస్తున్నాడు. పెద్ద కుమారుడు ప్రణయ్ బుధవారం శ్రీకాకుళంలో డిగ్రీలో చేరేందుకు వెళ్లి తిరిగి ఇంటర్‌సిటీ రైలులో కంచిలికి చేరుకున్నాడు. రాత్రి కావడంతో తండ్రికి బైక్‌పై రమ్మని కబురు పెట్టాడు. తండ్రి రమణమూర్తి బైక్‌పై వచ్చి కుమారుడిని తీసుకొని ఇంటికి వెళుతుండగా జాతీయ రహదారిపై కంచిలి మండలం కొజ్జిరియా గ్రామ సమీపంలో ఎదురుగా రాంగ్ రూట్లో వచ్చిన ఓ లారీ




ఢీకొట్టడంతో అక్కడికక్కడే తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని అంబులెన్స్‌లో సోంపేట, ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రులకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఒడిస్సా బరంపురం ఎంకే సిజి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. తండ్రి పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు కటక్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. కొందరి సలహా మేరకు బరంపురం నుంచి బుధవారం రాత్రి శ్రీకాకుళంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కోమాలో ఉన్న రమణమూర్తికి తలకు శాస్త్ర చికిత్స చేయాలని లక్షల్లో ఖర్చు అవుతుందని చెప్పడంతో ఆ పేద కుటుంబం.. కుటుంబ పెద్ద ప్రాణం కోసం ఏం చేయాలో తెలియక లబోదిబోమంటోంది. పొందూరు పుట్టుక గ్రామస్తులు, యువకులు సహృదయంతో ముందుకు వచ్చి ఇంటింటికి చందాలు వేసుకుంటూ కొంత మొత్తాన్ని వసూలు చేసి గురువారం ఆసుపత్రి నిర్వాహకులకు చెల్లించారు. ఇంకా లక్షల్లో అవసరం ఉందంటూ ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కుటుంబమంతా ఆధారపడిన యజమానిని కాపాడుకునేందుకు దాతలు పెద్ద మనసుతో బాధిత కుటుంబానికి సహాయం చేయాలని కుటుంబీకులు, గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## చంద్రబాబుకు తగునా ఇది?

***మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై జడ్పీ చైర్పర్సన్**

**సోంపేట అక్టోబరు16 (వార్త):** దేశంలో ఎక్కడా లేనివిధంగా గత ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ సారథ్యంలో వైద్య విద్యకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చిందని జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ అన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తూ వాటిలో ఇప్పటికే కొన్ని వైద్య కళాశాలలో ప్రారంభించి పేదలకు బాసటగా వైసిపి ప్రభుత్వం నిలిచిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరిస్తుండడం దురదృష్టకరమన్నారు. కార్పొరేట్లతో చంద్రబాబు చేతులు కలిపి ప్రభుత్వ వైద్య కళాశాలను గంపగుత్తగా ప్రైవేటు కట్టబెట్టి సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారు తప్ప పేదల అభివృద్ధికి అవకాశం ఇవ్వడం లేదని ఆమె వాపోయారు. సోంపేట మండలం ఉప్పలం గ్రామంలో గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణలో భాగంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు జెడ్పిటిసి ప్రతినిధి తడక జోగారావు వైసీపీ మండల కన్వీనర్ సిలగాన భాస్కరరావు, ఉప్పలం సర్పంచ్ బట్టి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



## కొరికాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగవకాశాలు

**ఎల్ఎన్‌పేట/హిరమండలం, అక్టోబరు16(వార్త):** ఇటీవల పాతపట్నం కేంద్రంలో కొరికాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణ పొందిన యువతీ, యువకులకు ఎం ఎన్ సి సోలార్ ఎనర్జీ కంపెనీలో 26 మంది ఉద్యోగాలు సాధించారు. మరో సాఫ్ట్ వేర్ కంపెనీలలో 15 మందికి పైగా ఉద్యోగాలు సాధించి కొరికాన ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు రవికుమార్, భవాని చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కొరికాన రవికుమార్, భవానీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కొరికాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణలు ఇచ్చి ఉపాధి కల్పించేలా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.





జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కొళాయిల ద్వారా బురదనీరు

**కోటబొమ్మాళి, అక్టోబరు 16(వార్త):** కోటబొమ్మాళిలో వారం రోజులుగా కొళాయిల ద్వారా బురదనీరు వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ముఖ్యంగా కరణాల వీధి, మంగళవీధి, రెడ్డికవీధి, పొందర వీధిలకు వర్షం పడిన 10 రోజుల వరకు బురదనీరు వస్తుందని, దీంతో ఈ నీటినే తాగాల్సి వస్తుందని, దీంతో రోగాల బారిన పడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నీరు ఓ తోటలోని నేలబావి నుంచి వస్తుందని, పంచాయతీ అధికారులు, సిబ్బంది ఆ భావిలో బ్లీచింగ్ చల్లిన పాపాన పోలేదని, మొదట్లో వర్షం కురిసిన రోజు బురదనీరు వచ్చి మరుచటి రోజు నుంచి మంచినీరు వచ్చేదని, ప్రస్తుతం వారం రోజులు గడ ఎస్తున్న ఇంకా బురదనీరు వస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు కుళాయిలు ద్వారా మంచినీటిని అందించాలని వారు కోరుతున్నారు.



# మా భూములిప్పించండి మహాప్రభో..!

**-గిరిజనులపై దౌర్జన్యం చేస్తున్నారు..**

**-ఆక్రమణకు గిరిజనేతరుల ప్రయత్నాలు**

**-పట్టించుకోని అధికారులు**

**-కన్నీటి పర్యవంతమవుతున్న బాధిత గిరిజనులు**



**మందస, అక్టోబరు 16(వార్త):** ఎప్పటి నుంచో సాగు చేస్తున్న జిరాయితీ భూములు.. పేద గిరిజనులకు ప్రభుత్వమిచ్చిన డి.పట్టాభూములు.. ఈ భూములను ఎంతో కష్టపడి సాగు చేస్తున్నాం.. సంవత్సరాల తరబడి సాగు చేస్తున్న ఈ భూములను ప్రస్తుతం గిరిజనేతరులు మా భూములంటూ వేధిస్తున్నారు.. దౌర్జన్యం చేస్తున్నారంటూ గిరిజనులు కన్నీటి పర్యవంతమవుతున్నారు. తమ కష్టాలను చెప్పి, మాకు న్యాయం చేయాలని కాళ్లా, వేళ్లా పడుతున్నా.. అధికారులు కరుణించడంలేదంటూ మందస మండలంలోని కొండలోగాం పంచాయతీ చాపరాయికాలనీకి చెందిన గిరిజనులు ఆరోపిస్తున్నారు. చాపరాయికాలనీకి చెందిన సవర మాధవరావుకు 107/7 సర్వే నెంబరులో రెండు ఎకరాల జిరాయితీ భూమి ఉంది. అదేవిధంగా సవర జయరాజు, కూర్మారావులకు 3.18ఎకరాల డి.పట్టా భూమి ఉంది. ఈ భూములను ఎప్పటి నుంచో తాము సాగు చేస్తున్నామని మాధవరావు, జయరాజు, కూర్మారావు చెబుతున్నారు. అయితే, హెటల్ నడుపుతున్న సుధతో పాటు మరో వ్యక్తి ఈ భూములు మావి అంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గిరిజనులమని కూడా చూడకుండా.. దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూముల్లో నిర్మించుకున్న గుడిసెను కూడా కూల్చేశారన్నారు. గిరిజన మహిళలను దుర్భాషలాడుతున్నారన్నారు. భూస్వాముల చేతుల్లో గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. తమకు జరిగిన అన్యాయంపై న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు. కానీ, అధికారులు సహకరించకపోవడంతో భూస్వాములు రెచ్చిపోతున్నారన్నారు. రెవెన్యూ యంత్రాంగాన్ని సర్వే చేయమని కోరగా.. గిరిజనేతరులు చెప్పినట్టు చేస్తున్నారని, పాత రికార్డులతో సర్వే చేయమంటే చేయడం లేదన్నారు. భూస్వాములు కొత్తగా తయారు చేసిన పత్రాల ప్రాప్తికి సర్వే చేయడం అన్యాయమని, పాత రికార్డులతో మాత్రమే సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎస్టీ కమీషన్ కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. కానీ, ఎటువంటి స్పందన రాలేదని ఆరోపించారు. చట్టం, న్యాయం మాకు తెలియదని, కొంతమంది గిరిజన నాయకులు, ప్రజాసంఘాల మద్దతుతో పోరాటం చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి, న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సవర నర్సింగరావు, సవర హరికృష్ణ, సవర గోపాలు, మాజీ సర్పంచ్ సవర జగ్గారావు, సవర జ్యోతి, సవర కుమారి, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోనేరు రమేష్ తదితరులు ఉన్నారు.



## సైన్స్ సెమినార్‌లో విజేతలు వీరే

**వీరఘట్టం, అక్టోబరు 16(వార్త):** స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన సైన్స్ సెమినార్ లో ఇద్దరు విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు మండల విద్యాశాఖ అధికారులు గౌరు నాయుడు, ఆనందరావు లు తెలిపారు మండల స్థాయిలో' క్వాంటం యుగం ఆరంభం... అవకాశాలు మరియు పరిమితులు' అనే అంశంపై నిర్వహించిన సైన్స్ సెమినార్ లో 12 మంది విద్యార్థులు హాజరయ్యారు అన్నారు. ఇందులో కత్తుల కవిటి హైస్కూల్లో చదువుతున్న జి. చైతన్యకు ప్రథమ స్థానం లభించింది. అలాగే పివిఆర్ పురం ఎంపీయుపి స్కూల్లో 8వ తరగతి చదువుతున్న పి. షర్మిలకు ద్వితీయ స్థానం లభించింది విజేతలుగా నిలిచిన ఇద్దరు విద్యార్థులు ఈనెల17 న జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరుగునున్న జిల్లా స్థాయి పోటీలకు హాజరు కావాలని వారు కోరారు విద్యార్థులకు గైడ్ టీచర్స్ గా ఉన్న జి జేమ్స్ కుమార్ , ఎంసంపత్‌కుమార్‌లకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోంబర, బిటివాడ కాంప్లెక్స్ చైర్మన్ సి.హెచ్.రత్నాకరరావు, పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంఆర్‌సీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ



**పోలాకి, అక్టోబరు 16(వార్త):** గొల్లలవలస ప్రాథమిక పాఠశాలలో గురువారం గ్రామ ఆశా వర్కర్ పర్యవేక్షణలో హెచ్. యంజి. శ్రీధర్ ఆధ్వర్యంలో ఐరన్ మాత్రలు విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ మాత్రల వల్ల విద్యార్థుల్లో రక్తహీనత, వివిధ రోగాల నుంచి ఉపశమం కలుగుతుందన్నారు. ప్రతి గురువారం తప్పనిసరిగా మాత్రలు విద్యార్థులకు అందేలా చూడడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## హ్యాండ్ పప్పెట్‌తో విద్యా బోధన



**జలుమూరు, అక్టోబరు 16(వార్త):** గొల్లపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విన్నూతనంగా విద్యార్థులకు పాఠాల బోధన చేపట్టామని హెచ్ఎం మాధవి తెలిపారు. ప్రభుత్వం అందించిన ఎఫ్ఎల్ఎన్ కిట్లతో హ్యాండ్ పప్పెట్ వినియోగిస్తూ పొడుపు కథలు చెప్పించామన్నారు. విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఇటువంటి వస్తువులతో బోధిస్తే సులువుగా అర్థమవుతుందన్నారు.

## కొత్తమ్మతల్లి ఆలయంలో అన్నదానం

**కోటబొమ్మాళి, అక్టోబరు 16(వార్త):** స్థానిక కొత్తమ్మతల్లి అమ్మవారిని గురువారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చే మంగళవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కావడంతో ఈ గురువారం జిల్లా నలుమూలలనుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండ ఆలయ కార్యానిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ అన్ని ఏర్పాట్లు చేశారు. భోజన సమయంలో అమ్మవారిని దర్శించుకున్న సుమారు 2వేలు వ ంది భక్తులకు ఆలయం అధికారులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు మంచాల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు అండగా సీఎం సహాయనిధి



**వీరఘట్టం, అక్టోబరు 16(వార్త):** నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి ఉంటుందని దీనిద్వారా వారికి ఆర్థిక భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు వీరఘట్టం మండలంకి చెందిన లబ్ధిదారులకి అనారోగ్య కారణముగా, అత్యవసరంగా జరిగిన వైద్య ఖర్చుల సహాయార్థం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందజేసిన చెక్కులను ఆయన ఈ సందర్భంగా వారికి అందజేశారు మండలంలోని నడుకూరు గ్రామానికి చెందిన తాడి అశోక్ కుమార్ కు రూ.89,928 విలువ గల చెక్కును అందజేశారు. చిటపుడివలస గ్రామానికి చెందిన మొనంగి కౌశిక్ కు రూ.42,000 విలువ గల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్ వీరఘట్టం టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ బల్ల హరిబాబు తూముల రమేష్ జనసేన జానీ అచ్యుతరావు కూటమి నాయకులు చింతా ఉమామహేశ్వరరావు వెలగాడ శ్రీనివాసరావు పొన్నాడ గొర్లె గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు

# స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు అడ్డుకట్ట



**వీరఘట్టం, అక్టోబరు 16(వార్త):** స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు అడ్డుకట్టు వేయవచ్చునని, తద్వారా లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనం చేకూరునుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలతో కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందని ఆయన అన్నారు. ప్రజలకు మేలు చేకూర్చాలనే దృక్పథంతో నిరంతరము సరికొత్త విధానాలతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఆయన గుర్తు చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రం ప్రగతి పదములో దూసుకుపోతుందని నిమ్మక ఆశాభావం వ్యక్తం చేశారు జిల్లాలో 2,73,000 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయవలసి ఉండగా నేడు వీరఘట్టం మండలం లో మొత్తం 19362 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను లబ్దిదారులకు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఈ స్మార్ట్ రేషన్ కార్డు ద్వారా రాష్ట్రం లో ఎక్కడ నుంచైనా స్మార్ట్ కార్డును ఉపయోగించి రేషన్ తీసుకునే వెసులుబాటును కూడా ప్రభుత్వం కల్పించిందని ఎమ్మెల్యే అన్నారు,

కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎం బాల సరస్వతి , తహశీల్దార్ ఏ కామేశ్వరరావు , మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, పట్టణ టిడిపి అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, బళ్లా హరిబాబు, తూముల రమేష్, కూటమి నాయకులు పొన్నాడ నాగేశ్వరరావు, చింత ఉమా మహేశ్వరరావు, గొర్లె గౌరునాయుడు, జనసేన జానీ అచ్యుతరావు, డీలర్ల సంఘం నాయకులు, డీలర్లు లబ్ధిదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్న కూటమి



**మందస, అక్టోబరు 16(వార్త):** ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణ చేస్తోందని వైకాపా నాయకులు ఆరోపించారు. తాళ్లగురంటి పంచాయతీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రవేటీకరణకు నిరసనగా కోటి సంతకాలు సేకరణలో భాగంగా రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నడూలేని విధంగా వైద్యాన్ని కూడా అమ్మేస్తున్నారన్నారు. అనంతరం పంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కమిటీలను నియమించారు. పంచాయతీ పార్టీ అధ్యక్షునిగా నల్ల లోకనాథచౌదరి, మహిళా విభాగం అధ్యక్షరాలుగా శాయ ఊర్మిళ, యువజన విభాగం అధ్యక్షులుగా రాయిక భోర్తో, విధ్యార్ధి విభాగం అధ్యక్షులుగా సురపతి నీలకంఠం, రైతు విభాగం అధ్యక్షులుగా నెయ్యిల రామచంద్ర, యస్టి విభాగం అధ్యక్షునిగా కట్టా దుర్యోధన, యస్సి విభాగం అధ్యక్షునిగా నరహరి భరత్, బిసి విభాగం అధ్యక్షునిగా కంసు ఉపేంద్రను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పులారి పితాంబరం, పార్టీ ప్రధాన కార్యదర్శ సురేష్ పాణిగ్రాహి, నియోజకవర్గం యువజన విభాగం కన్వీనర్ దున్న హరికృష్ణ, జిల్లా యస్సి సెల్ కార్యదర్శి బెలమర జీవన్, సీనియర్ నాయకుడు రాపాక శేషగిరి, స్థానిక సర్పంచ్ సవర దుదిష్ట, యమ్పీటిసి ప్రతినిధి లోకనాథచౌదరి, నల్ల భాస్కరరావు, దుర్జో, ఉపేంద్ర పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## చిన్నారి శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం



**ఇచ్ఛాపురం, అక్టోబరు16(వార్త):** కొఠారి గ్రామానికి చెందిన పావని కుమార్తె దీయా అనే చిన్న పాపకి (వయస్సు 1సం.6 నెలలు) న్యూమోనియా వ్యాధి సోకింది. రిమ్స్‌లో వెంటిలేటర్ పై వైద్యం అందిస్తున్నారు.పాప పరిస్థితి చాలా విషమించడంతో ఆ పాపకు మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.తల్లితండ్రులు పేదవారు కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. మెరుగైన వైద్యం కోసం ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10 వ తరగతి పూర్వ విద్యార్థులు 36500 రూపాయలు సహాయం అందజేసారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు రాపాక ఝూన్సీ

**పలాస, అక్టోబరు16(వార్త):** రాష్ట్ర స్థాయి పోటీలకు బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాపాక ఝూన్సీ ఎంపికైందని పిడి పద్మలోచన తెలిపారు. అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్, హైజంప్, 200 మీటర్లు పరుగు పందెంలో మొదటి స్థానాల్లో నిలచి 14 సంవత్సరాల బాలబాలికల అథ్లెటిక్స్ జిల్లా సెలక్షన్లలో అర్హత సాధించి వచ్చేనెల నవంబర్ 8, 9, 10 తేదీలలో రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. జడ్.పి.హెచ్.ఎస్, శ్రీకాకుళం జిల్లా గోవిందపురంలో జరగబోయే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటుంది.ఇంతకు ముందు అండర్ 14 విభాగంలో జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్, గుంటూరు నాగార్జున యూనివర్సిటీ యందు ట్రై అట్లేన్ 60 మీటర్స్, లాంగ్ జంప్ హై జంప్ మూడు ఈవెంట్లో విజేతగా నిలిచి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకుంది. రాపాక ఝూన్సీ స్వగ్రామం గొల్ల మాకన్నపల్లి, తల్లి రాపాక రూప, తండ్రి రాపాక సోమేశ్వరరావు వీరిది సామాన్య కుటుంబ నేపథ్యం. తల్లి అంగన్వాడి టీచర్, తండ్రి రైల్వేలో 4వ తరగతి ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. రాపాక ఝూన్సీ రాష్ట్ర పోటీలకు ఎంపిక కావడంపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## చిన్న కరగాం పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



**నరసన్నపేట, అక్టోబరు 16(వార్త):** నరసన్నపేట చిన్న కరగాం పాఠశాలను గురువారం ఎంఈఓ పేడాడ దాలినాయుడు సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే ఇటీవల జరిగిన ఎఫ్ఎ 2 పరీక్షల అసెస్మెంట్ పుస్తకాలను పరిశీలించి ఉపాధ్యాయులు మూల్యాంకనం చేసి విద్యార్థుల మార్కులను అప్లోడ్ చేయాలని సూచించారు.

## కరకవలసలో తాగునీరుకు మహిళల ఆందోళన



**జలుమూరు, అక్టోబరు 16(వార్త):** కరకవలసలో తాగునీటి కోసం మహిళలు గురువారం ధర్నా చేశారు. గ్రామంలో ఉన్న కాలనీలో యాదవ వీధిలో కుళాయిలు వద్ద గత కొన్ని నెలలుగా తాగునీరు రాకపోవడంతో ప్రజలు పలు అవస్థలు పడుతున్నామని వాపోయారు. తాగునీరు కోసం సుమారు 2 కిలోమీటర్లులో ఉన్న వంశధార నదికి వెళ్లాల్సి వస్తుందన్నారు. సంబంధిత అధికారులు ప్రజలకు మౌలిక సమస్యలపై స్పందించి నీటి దాహార్తిని తీర్చాలని మహిళలు కోరుతున్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**పలాస, అక్టోబరు16(వార్త):** రహదారుల అభివృద్ధితోనే పట్టణాభివృద్ధని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు గవర్నమెంట్ ఐటిఐ నుండి సూదికొండ రోడ్డు వరకు రూ.23 లక్షలతో నిర్మించే సిసి రోడ్ల నిర్మాణాలకు గురువారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బళ్ళ గిరిబాబు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు చెప్పారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణా లను చేపడుతుందన్నారు. పనులన్నింటినీ పూర్తి నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నడిపేన రామారావు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, డీఈ కనకరాజు, ఏఈ అవి నాష్, టిడిపి నాయకులు పిరుకట్ల విఠల్రావు, లోడగల కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, మల్లిపెద్ది నరేంద్ర (చిన్ని), గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దు



**పలాస, అక్టోబరు 16(వార్త):** ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగు బస్సు జాతాను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం పలాస ప్రెస్ క్లబ్ నందు బస్ జాతా వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. నాగభూషణం మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి నవంబర్ 12 వరకు ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి బస్సు జాత కొనసాగుతుందని తెలియజేశారు. కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మరణించి, 200కు పైగా విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైతే, నిన్న ఒక విద్యార్థి మరణించినా ఏ ఒక్క ప్రజా అధికారిగాని స్థానిక ప్రజా ప్రతినిధులుగాని స్పందించకపోవడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ముఖ్యంగా పిపిపి పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తున్న కూటమి ప్రభుత్వం ఆలోచనలను విరమించుకోవాలని కోరారు. రాష్ట్రంలో మూతబడిన 4111 ప్రభుత్వ పాఠశాలలు తెరిపించాలని, యూనివర్సిటీలో నాన్ టీచింగ్ పోస్టులు భర్తీచేయాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో నేను అధికారంలోకి వస్తే బకాయిలన్నీ పూర్తిస్థాయిలో విడుదల చేస్తానని చెప్పిన లోకేష్ అధికారంలోకి వచ్చాక తానే స్వయాన విద్యాశాఖ మంత్రి అయినా విద్యారంగ సమస్యలు గాలికి వదిలేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తున్నారని గుర్తు చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రవికుమార్ మాట్లాడుతూ బీసీ ఎస్సీ ఎస్టీ వసతి గృహాలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయన్నారు. ఈనెల 23వ తేదీన రాష్ట్రం లో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికై జరుగుతున్న బస్సు జాతా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమవుతుందని, పలాస, శ్రీకాకుళం ఈ జాతా విద్యార్థుల సమస్యలు పరిష్కారానికై సందర్శిస్తుందని, విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె. సాయి ఏఐఎస్ఎఫ్ పలాస పట్టణ నాయకులు సోమేశ్, కిరణ్, నితిన్, విజయ్, హరి తదితరులు పాల్గొన్నారు.

# వేధింపులే కూటమి ప్రభుత్వం లక్ష్యం: రెడ్డి శాంతి





**కొత్తూరు, అక్టోబరు 16 (వార్త):** రాష్ట్రంలో ప్రస్తుతం నియంతృత్వ పాలన సాగుతోందని, టీడీపీ కూటమి ప్రభుత్వం కేవలం వేధింపుల లక్ష్యంగానే పనిచేస్తుందని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన నాటి నుండి రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ, కూటమి నాయకులు చట్టాన్ని వారి చేతుల్లోకి తీసుకున్నారని విమర్శించారు. చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎటు పోతున్నాయో తెలియని దుస్థితి నెలకొందని, మంత్రి లోకేష్ రూపొందించిన 'రెడ్ బుక్ రాజ్యాంగాన్ని' రాష్ట్రంలో అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, సామాన్యులకు సైతం భద్రత కరువైందని పేర్కొన్నారు. దాడులు, హత్యలు, అరాచకాలు నిత్యకృత్యంగా మారాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'కల్తీ మద్యం' నిరసనలకు పెద్ద ఎత్తున నాయకులు, మహిళలు హాజరుకావడంతో అధికార పార్టీ నాయకుల గుండెల్లో భయం పట్టుకుందని రెడ్డి శాంతి అన్నారు. అందుకే, ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పలాస నియోజకవర్గానికి చెందిన వేణుగోపాల్ రెడ్డి అనే వైఎస్సార్సీపీ కార్యకర్తపై... 'మహిళా పోలీసును తోసేశారంటూ' ఒక పసలేని ఆరోపణను తెరపైకి తెచ్చి వేధించాలని చూస్తున్నారని ఆమె మండిపడ్డారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయాలని, ఏదో ఒక రకంగా వేధింపులనే లక్ష్యంగా పెట్టుకొని టీడీపీ కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తుందని విమర్శించారు.

# సామాన్య, మధ్యతరగతికి సూపర్ గిఫ్ట్ జీఎస్టీ తగ్గింపు




**పలాస, అక్టోబరు16(వార్త):** సామాన్య, మధ్యతరగతి ప్రజలకు జిఎస్టితో తగ్గిన ఎంతో మేలు జరిగిందని, రవాణా, లాజిస్టిక్ రంగానికి సూపర్ గిఫ్ట్" ఇచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. రవాణా, లాజిస్టిక్ రంగానికి సూపర్ గిఫ్ట్" ఇచ్చిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ""సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్"" ర్యాలీలో గురువారం పలాస ఎమ్మెల్యే శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఎస్టీ మార్పుల ద్వారా ప్రజలకు కలిగే ఆర్థిక లాభాలు, ముఖ్యంగా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడం, పన్ను సరళీకరణ వంటి అంశాలను ప్రజలకు వివరించడం ఈ కార్యాచరణ యొక్క ప్రధాన ఉద్దేశం అన్నారు. రవాణా రంగంలో జీఎస్టీ 2.0 మార్పుల వల్ల సరుకు రవాణా ఖర్చులు తగ్గుతూ, సాధారణ ప్రజలకు, వ్యాపారాలకు సమర్థమైన ధరలలో సేవలు అందడంతో పాటు దేశీయ వాహన తయారీ ప్రోత్సాహం కలుగుతుందని చెప్పారు. ఈ మార్పులు సమాజంలో మధ్యతరగతి వర్గానికి ముఖ్యంగా లాభదాయకం అవుతాయని భావిస్తున్నారు. ఈ విధానంలో, రవాణా రంగానికి సంబంధించి పన్ను సులభతరమైంది, వ్యాపారాలకు అనుకూల వాతావరణం సృష్టించింది, అలాగే ప్రభుత్వ వసూళ్ల సరైన సమీకరణంతో పన్ను ఆదాయంలో స్థిరత్వం తీసుకువచ్చేందుకు ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మాధుసూదనరావు, రావు ఏపీ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పలాస అధికారి కె రాము, పలాస ఆర్డీవో వై శ్రీనివాసరావు, మేధా స్కూల్ కరెస్పాండెంట్ సోమేశ్వరరావు, టిడిపి నాయకులుపీరుకట్ల విఠల్, లోడగల కామేశ్వరరావు, సప్ప నవీన్, జోగా మల్లేశ్వరరావు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు,ఆటో యూనియన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నివగాంలో కిమ్స్ వైద్య శిబిరం



**కొత్తూరు, అక్టోబరు 16(వార్త):** నివగాం గ్రామ పంచాయతీ కి చెందిన తెలుగుదేశం పార్టీ ఉప అధ్యక్షులు బిల్లింగి సంజీవరావు, ఎంపీటీసీ బిల్లింగి కృష్ణవేణి ల ఆధ్వర్యంలో గురువారం నాడు కిమ్స్ హాస్పిటల్ వారిచే నివగాం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య తనిఖీలు చేయించుకున్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత పరీక్షలు అయిన ఈసీజీ, 2డీ ఎకోతో పాటు రక్తపోటు, షుగర్ వంటి ముఖ్యమైన పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం డాక్టర్లు అందించిన సలహా మేరకు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంరక్షణపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసి వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం పట్ల తమ నిబద్ధతను తెలియజేశారు. పేద ప్రజలకు అత్యాధునిక వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.?ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, ఎన్డీఏ కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని ఈ ఉచిత శిబిరాన్ని విజయవంతం చేశారు.

## రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**పలాస, అక్టోపరు 16 (వార్త):** రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస జి ఆర్ పి ఎస్ ఐ ఎ కోటేశ్వరరావు వెల్లడించారు. గురువారం పలాస రైల్వే స్టేషన్ పరిధిలో ప్లాట్ఫార్మ్ నెంబర్ 2 అప్ లైన్ వద్ద ఉన్న కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జి దగ్గరలలో సుమారు 40-45 సంవత్సరాల వయస్సు గల మగ వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు శరీరంపై నాచురంగు గల 3/4 షాట్, బ్లూ కలర్ టీ షర్ట్. మరిన్ని వివరాలకు పలాస జి ఆర్ పి ఎఫ్ ఎస్సై ఎ. కోటేశ్వరరావుకు గాని, 9440627567, హెడ్ కానిస్టేబుల్ ఎం. సోమేశ్వరరావు 9492250069 నెంబర్ కు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

# జీఎస్టీ తగ్గింపుతో కొనుగోలు శక్తి పెరుగుదల




**పలాస, అక్టోబరు16(వార్త):** జిఎస్టి తగ్గింపుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు పెరిగిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ పట్టణం శ్రీనివాస లాడ్జి సమీపంలో సోమవారం బి ఎస్ ఆర్ షాపింగ్ మాల్ 2వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి బి ఎస్ ఆర్ యాజమాన్యానికి షాపింగ్ మాల్ 2వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ రోజురోజుకీ వాణిజ్య సముదాయాలు పలాస-కాశీబుగ్గ జంట పట్టణంలో ఏర్పాటు కావడంతోనే పలాస ఖ్యాతి ఇనుమడింప చేయడంతో పాటు ప్రత్యేక గుర్తింపు వస్తోందన్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణ ప్రజల విశ్వాసాన్ని బి ఎస్ ఆర్ షాపింగ్ మాల్ కోరుకుంటుందని పేర్కొన్నారు. బి ఎస్ ఆర్ షాపింగ్ మాల్ మాట్లాడుతూ అన్ని రకాల వినియోగ వస్తువులపై కేంద్రం జీఎస్టీ తగ్గించిందని దినివల్ల ధరలన్నీ అదుపులో ఉండడంతో పాటు సామాన్య మధ్య తరగతి ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిందని, తమ షాపింగ్ మాల్ లో అన్ని వర్గాల ప్రజల అవసరాలకు తగ్గట్టుగా కనిష్ట స్థాయి నుంచి గరిష్ట స్థాయి వరకు నాణ్యమైన వస్త్రాలు, అందు బాటులో ఉంటాయిని స్పష్టం చేశారు. జీఎస్టీ తగ్గించడం వలన మా షాపింగ్ మాల్ లో వ్యాపారం కూడా బాగా పెరిగాయని, జీఎస్టీ తగ్గించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బి ఎస్ ఆర్ యాజమాన్యం, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, బిఎస్ఆర్ యజమాని సురేష్, టిడిపి నాయకులు కోట్నీ దుర్గాప్రసాద్, పిరుకట్ల విటల్, రావు, లొడగల కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, సప్ప నవీన్, షాపింగ్ మాల్ యాజమాన్యం సిబ్బంది నవీన్, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## బీఎల్వోలు సక్రమంగా విధులు నిర్వర్తించాలి



**ఇచ్ఛాపురం, అక్టోబరు16(వార్త):** నియోజకవర్గం మొత్తం 299 బి ఎల్ వో లు తో స్థానిక తహసిల్దార్ కార్యాలయం లో ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ప్రత్యేక ఉప కలక్టర్ బి .పద్మావతి శిక్షణ ఇచ్చారు . నాల్గు మండలాలు తహసిల్దార్ లు ఎన్ .వెంకటరావు (ఇచ్చాపురం) , బి మురళి మోహనరావు( కవిటి ), ఎన్ ,రమేష్ (కంచిలి) , బి .అప్పల స్వామి (సోంపేట) హాజరయ్యారు . ఈ సమావేశం లో ప్రతి బి ఎల్ వో లు తన యాప్ లో ఫారం 6 ఓటరు చేర్పులు , ఫారం 7 తొలగింపులు , ఫారం 8 మార్పులు గురించి క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు . మరియు ఎవరు ప్రలోబాలు లొంగకుండా ఎటువంటి తొలగింపులు , నివాసం మార్పులు చేయరాదని. మరియు 2002 నాటి ఓటర్ల జాబితా డేటా ప్రతి బి ఎల్ వో ల వద్ద అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నామకరణం/పార్ట్ నంబర్లో మార్పు ఉన్నప్పటికీ, 2002 నాటి అదే ప్రాంతం/వీధిని 2025 నాటి దానితో మ్యాప్ చేయాలని కోరారు.

## చెక్కు బౌన్స్ కేసులో ముద్దాయికి జైలు శిక్ష




**పలాస, అక్టోబరు16(వార్త):** పలాస న్యాయస్థానం పరిధిలో శ్రీ రామ్ ఫైనాన్స్ వారు వద్ద ఋణం తీసుకొని తిరిగి చెల్లించే నిమిత్తం చెక్కు ఇవ్వగా ఆ చెక్కు బౌన్స్ అయిన సందర్భంలో పలాస కోర్టులో కేసు నమోద చేయగా కోర్టు విచారణ జరిపి ముద్దాయి మల్లా సదాశివరావు పై నేరం రుజువైనందున ముద్దాయికి సంవత్సర కాలం పాటు జైలు శిక్ష, చెక్కు యొక్క సొమ్ము మూడు నెలల్లో చెల్లించవలసిందిగా ఆదేశించడమైనది. సొమ్ము చెల్లించని యెడల మరొక మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ పలాస కోర్టు మెజిస్ట్రేట్ యూ మాధురి వెల్లడించారు.

# కళాశాల అభివృద్ధికి ప్రిన్సిపాల్ ఔదార్యం




**ఇచ్ఛాపురం, అక్టోబరు16(వార్త):** ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లో పలు అభివృద్ధి పనుల కుభూమి పూజ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇటీవల ప్రిన్సిపాల్ గా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన చింతాడ శరత్ బాబు కళాశాలకు మౌలిక మరియు వసతి పరమైన అభివృద్ధికై తనదైన మార్కు వేసుకుంటూ తన సొంత నిధులతో లక్షలాది రూపాయలు వ్యయంతో కూడిన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.దీనిలో భాగంగా విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిత్యానంద పట్నాయక్ తో కలిసి కళాశాల ప్రధాన ద్వారము మరియు ప్రిన్సిపాల్ రూమ్ ఆధునిక సుందరీకరణ పనులకు భూమి పూజ చేశారు. విశ్రాంత ప్రిన్సిపాల్ నిత్యానంద పట్నాయక్ మాట్లాడుతూ గతంలో కూడా కవిటి ,బారువ, మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న సమయంలో శరత్ బాబు తన సొంత నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని ఇది చాలా హర్షనీయమైన విషయమని తెలియజేశారు .అలాగే గ్రామ ప్రజలు కూడా ప్రిన్సిపాల్ శరత్ బాబు చేపడుతున్న అభివృద్ధి పనులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏజీఎంఓ నల్లాన రమేష్ సీనియర్ అధ్యాపకులు బోరుభద్ర సురేష్ కుమార్, పైడి సురేష్ కుమార్ ,దువ్వు మమత మరియు ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## లింగాలపాడు పాఠశాలను పరిశీలించిన ఏఎంఓ



**జలుమూరు, అక్టోబరు 16(వార్త):** లింగాలపాడు ప్రాథమిక పాఠశాలలు సమగ్ర సర్వ శిక్ష అభియాన్ ఏఎంఓ చిగిలిపల్లి సుధాకర్ రావు ఆకస్మికంగా పరిశీలించారు. గురువారం పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థుల సామర్థ్యాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన విద్యా బోధన చేపట్టాలని ఉపాధ్యా యులకు సూచించారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలన చేయాలని పేర్కొన్నారు.

# సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

**పలాస, అక్టోబరు16(వార్త):** సీపీఆర్ చేయడం ద్వారా ఎలా ప్రాణాన్ని కాపాడ వచ్చో నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ రెడ్ క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీకాకుళం శాఖ వారు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీపీఆర్ అంటే కార్డియోపల్మోనరీ రిససిటేషన్, గుండె ఆగిపోయినప్పుడు లేదా ఊపిరితిత్తులు శ్వాసతీసుకోని స్థితిలో ఉన్నప్పుడు, వ్యక్తికి సీపీఆర్ చేయడం ద్వారా ఎలా ప్రాణాన్ని కాపాడవచ్చో తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు, ఎముకలు విరిగినప్పుడు ట్రాయాంగిల్ బ్యాండెజ్ ద్వారా ఎలా కట్టుకట్టాలో తదితర ప్రధమచికిత్స విధానాలు కోసం రెడ్ క్రాస్ సభ్యులు సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు టి. హేమారావు ఆధ్వర్యంలో నిర్వహించగా ఎంపీడిఓ రమేష్ నాయుడు ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బి. లక్ష్మిపతి, జూనియర్ రెడ్ క్రాస్ క్లబ్ జిల్లా కమిటీ సభ్యులు కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.




## మున్సిపాలిటీ లో కోటి సంతకాల సేకరణ

**ఇచ్ఛాపురం, అక్టోబరు16(వార్త):** మున్సిపాలిటీ పరిధిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. నియోజకవర్గ వైస్సార్సీపీ అబ్జర్వర్ దుంపల లక్ష్మణరావు , జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ మరియు నియోజకవర్గ ఇంచార్జ్, పిరియా విజయ , ఎమ్మెల్సీ నర్తు రామారావు , మాజీ శాసన సభ్యులు పిరియా సాయిరాజ్ లు, కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల వ్యవహారంలో అనుసరిస్తున్న ప్రైవేట్ తప్పుడు విధానాలకు నిరసిస్తూ, వైస్సార్సీపీ చేపట్టిన కోటి సంతకాలు ప్రజల నుంచి సేకరించే కార్యక్రమంలో భాగంగా, మున్సిపాలిటీ లో కోటి సంతకాల కార్యక్రమం పై పట్టణ ప్రజలకు వివరిస్తూ, వినతి పత్రం పై సంతకాలు సేకరించే కార్యక్రమం చేపట్టారు గ్రామ దేవత స్వేచ్ఛ వతి అమ్మవారి ఆలయం ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రామ పట్టణ కమిటీలు, అనుబంధ కమిటీ లు నియామకం పై చర్చించారు.ఈ కార్యక్రమంలో,మున్సిపల్ చైర్మన్ పిలక రాజ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ ఛైర్పర్సన్ ఉలాల భారతి దివ్య,వైస్ ఛైర్పర్సన్ లాభాల స్వర్ణమణి, పిలక సంతు,కౌన్సిలర్లు ప్రేమ్, ఢిల్లీ, తిరుపతి, అన్వేష్, కిరణ్, కోటి, పి. మధు, బచ్చు జగన్, తేజ, నారాయణ, బి. త్రినాధ్, నీలపు ఢిల్లీ, పిలక విజయ్, చిడిపోతు జగన్, నరసింహులు, తాడి ఆదిరెడ్డి, తేజ, కాళ్ళ సత్యం, జి. ప్రదీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.





## సీఆర్పీల సమీక్ష సమావేశం

**నరసన్నపేట, అక్టోబరు 16(వార్త):** నరసన్నపేట ఎంఆర్సీ కార్యాలయంలో గురువారం ఎంఈఓలు ఉప్పాడ శాంతారావు పేడాడ దాలినాయుడు ఆధ్వర్యంలో సీఆర్పీలకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. విద్యాంజలి, 2.0 వీర గాథ, అపార్ జనరేషన్ వంటి కార్యక్రమాల పైన కాంప్లెక్స్ వారీగా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ శశిరేఖ, అకౌంటెంట్ సత్యనారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ కృష్ణ పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546